ప్రతి గడపకు కృష్ణాజలాలు


జరుగుతున్న పైపులైన్ పనులు


కొళాయి ద్వారా నీళ్లు పట్టుకుంటున్న మహిళ


ఏర్పాటు చేస్తున్న పైపులైన్‌లు

- జలదీక్ష ద్వారా రెండు నెలలకు ఒక గ్రామం పూర్తి
- రాబోయే సంవత్సరంలో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు
- మూడు గ్రామాల్లో పనులు ప్రారంభం

పిడుగురాళ్ల: కృష్ణమ్మ నియోజవర్గాన్ని తాకుతూ పోతూనే ఉంది.. కానీ ఏళ్ల గడిచినా నియోజవర్గానికి కృష్ణా జలాలు అందలేదు... ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు అల్లాడిపోతున్నా కృష్ణా జలాలు నియోజకవర్గాంలోని ఏ గ్రామాన్ని తాకలేదు... నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిచొరవతో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతి గడపకు కృష్ణా జలాలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా జలదీక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే పిడుగురాళ్ల మండలంలోని అన్ని గ్రామాల్లో పైపులైన్ ద్వారా కృష్ణా జలాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు ప్రత్యేకించి జలజీవన్ మిషన్ ద్వారా నిధులను మంజూరు చేయించడంతోపాటు సమయాన్ని ఎక్కడా వృద్ధా చేయకుండా అధికారులను పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే మండలంలోని జానపాడు 1, జానపాడు 2, కరాలపాడు గ్రామాలకు టెండర్లు పూర్తి అయ్యాయి వారంలో పనులు కూడా ప్రారంభం కానున్నాయి. మిగిలిన పంచాయతీల్లో కూడా వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభం కాబోతున్నాయి. దీంతో మండలంలోని ప్రతి పల్లెలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాల కుళాయిలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజల చిరకాల కోరిక ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చొరవతో పూర్తి కానుంది.

త్వరలోనే పనులను పూర్తి చేస్తాం

పిడుగురాళ్ల మండలంలో అన్ని పంచాయతీలోని ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి కృష్ణా జలాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం, ఇప్పటికే మూడు గ్రామాలకు టెండర్లు పూర్తి అయ్యాయి. మిగిలిన గ్రామాలకు కూడా వెంటనే టెండర్లు పిలిపించి రెండు, మూడు నెలల్లోనే పనులను పూర్తి చేస్తాం

–అలెక్స్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, పిడుగురాళ్ల

నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందిస్తాం



నియోజకవర్గంలో టీడీపీ హయంలో ఒక్క ఇంటికి కూడా కృష్ణా జలాలు అందించిన పాపన పోలేదు. ప్రజలు ఫ్లోరైడ్‌తో ఇబ్బందులు పడుతున్నా కూడా పట్టించుకోలేదు. కానీ నేడు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ఫ్లోరైడ్ రహిత, శుద్ధి చేసిన కృష్ణా జలాలు అందిస్తున్నాం, పట్టణంలో 8 వేల కనెక్షన్‌లు ఇవ్వడం జరిగింది. అన్ని పంచాయితీల్లో టెండర్లు పూర్తి అయ్యాయి. పనులు కూడా రెండు మూడు నెలల్లో పూర్తి చేస్తాం.

–కాసు మహేష్‌రెడ్డి, గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు

గ్రామాలవారిగా ఇలా...

పిడుగురాళ్ల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు గాను నిధులు రూ. 20 కోట్ల 86 లక్షల 98 వేలు నిధులు మంజూరు అయ్యాయి. వీటికి గాను అన్ని గ్రామల్లో 16,641 కుళాయిలను ప్రతి ఇంటికి ఏర్పాటు చేయనున్నారు.

గ్రామ పంచాయతీ	ఏర్పాటు చేయనున్న కుళాయిలు	మంజూరు అయిన నిధులు (రూ. లక్షల్లో)
కోనంకి, అల్లూరి సీతరామాం		
జనేయ కాలనీ	1224	77.20
పాతగణేశునిపాడు	620	72
వీరాపురం తుమ్మలచెరువు,	184	113.60
అంజనీపురం	1889	258.10
బ్రాహ్మణపల్లి	1960	140.20
కామేపల్లి	640	137.40
న్యూ వెల్లంపలి	15	15
కరాలపాడు	1240	75
చెన్నాయిపాలెం	419	114.20
పెద అగ్రహారం	--	40
చిన్న అగ్రహారం	307	74.40
జానపాడు	3305	410.20
పందిటివారిపాలెం	825	106.08
జూలకలు	1803	197.70
గుత్తికొండ	2210	255.90

క్లుప్తంగా

వాలీబాల్ టీమ్‌కు ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: పట్టణంలోని వాలీబాల్ టీమ్‌కు రూ. 15 వేల చెక్కును బీసీ సెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య అందజేశారు. ఈసందర్భంగా కందులూరి శివయ్య మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించడంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ముందు ఉంటారని, ఆయన అడుగు జాడల్లోనే నడవాలని, ప్రతిభ ఉండి కూడా ప్రోత్సాహం లేక వెనుకబడిపోతున్న క్రీడాకారుల సహాయార్థం అందజేయడం జరిగిందని ఆయన తెలియజేశారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీఎల్‌వో విధులకు అంగన్‌వాడీలపై ఒత్తిడి తగదు

నరసరావుపేట: బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో) డ్యూటీలు చేయాలని అంగన్‌వాడీలను ఒత్తిడి చేయడం తగదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. మల్లీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనేక యాప్‌లు, రిజిస్టర్లలో వివరాల నమోదుతో పాటు పిల్లలు, తల్లులకు పోషకాహారం వండి పెట్టాల్సిన బాధ్యతలు ఉన్న నేపథ్యంలో అంగన్‌వాడీలు బీఎల్‌ఓ విధులకు హాజరుకావడం సాధ్యం కాదన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్కూల్లోనే ఉండాలని, ఈ నేపథ్యంలో బీఎల్‌వోగా ఇళ్లచుట్టూ తిరిగే డ్యూటీకి వెళ్లడం కుదరదని తెలిపారు. గతంలో అనేక పోరాటాలు చేసి ఈ విధుల నుంచి వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో 2019లో విముక్తి లభించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రాజుపాలెం, సత్తెనపల్లి మండలాలలో ఉద్యోగుల కొరత అంటూ అంగన్‌వాడీలను బీఎల్‌వో విధులకు హాజరుకావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఒత్తిడి పెరిగితే ఉద్యమం చేస్తామని మల్లీశ్వరి హెచ్చరించారు.

కేబుల్ వైర్లను కత్తిరించిన దుండగులు

- పట్టణంలో నిలిచిపోయిన ప్రసారాలు
- చానల్ నిర్వాహకుడి ఫిర్యాదుతో కేసు నమోదు

నరసరావుపేట టౌన్: కేబుల్ వైర్లు కత్తిరించి ప్రసారాలకు అంటంకం కల్గించడంపై వి.చానల్ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్‌ఐ ఎస్. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ కళాశాల, ప్రకాష్‌నగర్, ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో దుండగులు శుక్రవారం రాత్రి కేబుల్ వైర్లను కత్తిరిచారు. దీంతో పట్టణంలో వి.చానల్ ప్రసారాలు శనివారం నిలిచిపోయాయి. ఈ మేరకు చానల్ నిర్వాహకులు భూమిరెడ్డి కొండారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేబుల్ వైర్లు కట్ చేసిన ప్రాంతంలో సీసీ పుటేజీలను పరిశీలించి ఇద్దరు నిందితుల్ని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరికి పూజలు



నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ నక్షత్ర పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ఉత్తరా నక్షత్రాన జన్మించినందున గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామానికి చెందిన దోగిపర్తి సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు ప్రసాదాల వితరణ చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థినిలకు నగదు బహుమతులను అందజేస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి

రెంటచింతల: సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థినుల విద్యావృద్ధికి ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ అందచేస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థినిలకు పౌష్టికాహారం, మెరుగైన వైద్యం అందిస్తూ వారికి చేయుతనందిస్తుందన్నారు. సీఎం జగన్ దేశంలో ఏ రాష్ట్రంలో అమలుచేయని విధంగా అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్య, జగనన్న విద్యాకానుక వంటి విప్లవాత్మక పథకాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారానే ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. ఎన్నో కష్టాలుపడి అత్యున్నతస్థాయికి చేరుకున్న మహనీయులు జీవిత చరిత్రలను తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడిచి మీ తల్లి దండ్రులకు, మీమీ గ్రామాలకు గుర్తింపు తీసుకురాలని అప్పుడే మీ జీవితం సార్థకమౌ తుందన్నారు. తరగతి గదులలో బోధించే పాఠాలను ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 2023 మార్చి 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలకు గురజాల ఇండియన్ గ్యాస్ అధినేత హరి సుబ్రమణ్యం రెడ్డి అందచేసిన నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గురజాల ఏఎస్‌డబ్ల్యూటివి సుజాత కుమారి, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల వేల్ఫేయర్ ఆఫీసర్లు నూరెల్లాబేగ్, అరుణకుమారి, గురజాల ఇండియన్ గ్యాస్ అధినేత హరి సుబ్రమణ్యంరెడ్డి విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన నారుతోనే మిరపలో అధిక దిగుబడులు

- చిలకలూరిపేట ఉద్యాన అధికారి కిశోర్ కుమార్ యాదవ్
- నియోజకవర్గంలో 11 నర్సరీల్లో మిరప నారుమళ్లు తయారీ
- పోషకాల లభ్యత, తెగుళ్ల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి


నర్సరీలోని మిరప నారును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కిశోర్ కుమార్ యాదవ్

యడ్లపాడు: ఇటీవల వాతావరణం చల్లబడి, అక్కడక్కడా జల్లులు కురవడంతో మిరప రైతులు నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో అధికంగా ఖరీఫ్‌లో మిరప సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే, రైతులంతా నాణ్యమైన నారును సిద్ధం చేసుకోవాలని చిలకలూరిపేట ఉద్యాన అధికారి ఎస్. కిశోర్ కుమార్ యాదవ్ సూచించారు. నారు విషయంలోనే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పంట నష్టం జరగకుండా ప్రభుత్వం కూడా ముందుగానే నర్సరీల్ని సంబంధిత శాఖల అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయిస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని 11 నర్సరీలను సందర్శించి, నిర్వహణ, రికార్డులు, నారు పెంచే తీరును పరిశీలించినట్లు వెల్లడించారు. చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లో రెండేసి నర్సరీలు ఉండగా, ఒక్క నాదెండ్ల మండలంలోనే -7 ఉన్నాయని చెప్పారు. చిలకలూరిపేటలో ఒకటి, నాదెండ్లలోని రెండు నర్సరీలకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్లు లేవని, వారంలోగా చేయించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.


పర్యవేక్షణ తప్పనిసరి

కేవలం విత్తనాలను నర్సరీలకు అప్పగించి ఊరుకోకుండా పలుమార్లు వాటిని పర్యవేక్షణ చేయాలని, నారు పోసే విధానం, మొక్కగా రూపాంతరం చెందే క్రమంలో వచ్చే మార్పుల్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సీడింగ్ సమయంలో మొక్కలో ఆకుముడత, ఆకు మచ్చలు, నారుకుళ్లు వంటి తెగుళ్లు సోకుతున్నాయో లేదో గమనించాలన్నారు. అటువంటి వాటిని గుర్తిస్తే వెంటనేన శిలీంధ్ర నాశనులు చల్లుకుని నారుకుళ్లు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రధానంగా మొక్కలకు పోషకాల లోపం లేకుండా చూసుకోవాలని తెలిపారు.

విత్తు నుంచే రక్షణ చర్యలు

ట్రేలలో కోకోపిట్‌లో విత్తనాల్ని వేస్తున్నారని, సహజసిద్ధంగా భూమిలో మాదిరి మొక్కకు కోకోపిట్ ద్వారా పోషకాలు మొక్కకు లభించవని తెలిపారు. ఇందుకోసం 19-19-19, ఫార్ములా -4 సూక్ష్మధాతువును కోకోపిట్‌లో విత్తుకు ముందుగానే కలుపుకోవాలని సూచించారు. 20 రోజుల తర్వాత తిరిగి వాటినే నారుపై పైపాటుగా చల్లుకుంటే సమగ్రంగా పోషకాలు అంది మొక్కల ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. నారు సమయంలోనే తెల్లదోమ రాకుండా మొక్కల్ని కాపాడుకునేందుకు పసుపు జిగురు అట్టల్ని ఎకరాలనికి 30-40 మధ్య ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నారుకు ఎంతో మేలు చేసే జీవ శిలీంధ్రాలు ట్రైకోడెర్మవిరిడి, సూడోమోనాస్, వీఏఎంను కోకోపిట్‌లో కలుపుకొని విత్తనాలు నాటితే వేరుకుళ్ల బారి నుంచి శాశ్వతంగా రక్షించుకోవచ్చని చెప్పారు.

జాషువా జీవితం-సాహిత్యం పై వ్యాసరచన పోటీలు



సత్తెనపల్లి: విశ్వనరుడు గుర్రం జాషువా 52వ వర్థంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 9వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాషువా జీవితం -సాహిత్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలను స్థానిక ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 116 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఇర్మీయా, సురేష్ బాబు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వ్యాసరచన పోటీలకు పంపించిన స్కూలు ఉపాధ్యాయులకు వారు ధన్యవాదములు తెలిపారు. ప్రకటించిన విధంగా విజేతలకు బహుమతులను త్వరలో అందిస్తామని తెలిపారు.

నేడు గ్రామంలో జగనన్న సురక్ష

రెంటచింతల: అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించి, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం రెంటచింతల గ్రామంలోని సచివాలయం-2లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కె.పుల్లారావు, ఈఓపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జే.రాజారావు, ఆర్‌డబ్ల్యుస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ పథకాలు అందని అర్హులైన వారికి పథకాలను అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించి వారికి ధృవీకరణ పత్రాలను అందచేయడం జరుగుతుందన్నారు. గ్రామంలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దుర్గి: పోలేపల్లి సచివాలయం పరిధిలోని తేరాల, పోలేపల్లి గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ కే సమతావాణి తెలిపారు. ఆయా గ్రామాల్లో వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాల కోసం ముందుగానే టోకెన్లు అందజేశామని వివరించారు. ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరడానికి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పలువురు హాజరు కానున్నట్లు తెలిపారు.

రాయితీ టమాటాలు పంపిణీ

సత్తెనపల్లి: బహిరంగ మార్కెట్‌లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందుబాటు లో లేకుండా కిలో రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతున్న టమాటాలను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా పేదలకు మేలు చేయడానికి కిలో రూ. 50కే రాయితీ టమాటాలను పంపిణీ చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కిలో రూ.50 కే రాయితీ టమాటాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని రైతు బజార్‌లో షాపులు కేటాయించిన డ్వాక్రా గ్రూపుల ద్వారా టమాటాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సబ్సిడీ టమాటాలను వినియోగదారులకు అందజేయడాన్ని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాల కుట్రలో భాగంగా కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో టమాటలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు సబ్సిడీపై రూ.50కే కిలో చొప్పున అందించడం జరుగుతుందన్నారు. వినియోగదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్న క్రమంలో పథకం ప్రకారం టమాటాలు పంపిణీ పక్కదారి పడుతుందంటూ అసత్య ప్రచారాలు చేయడం అర్థరహితమన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు అందించేలా చూడాలని దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఆయన ఖండించారు.

పల్లెలకు ఆరోగ్యదాతలు గ్రామీణ వైద్యులు


లైఫ్‌లైన్ హాస్పటల్ డాక్టర్ పి.రాజనందారెడ్డిని సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

నకరికల్లు: పల్లెలకు ఆరోగ్యదాతలుగా గ్రామీణ వైద్యుల సేవలను కొనియాడాలని డాక్టర్ పి.రాజనందారెడ్డి అన్నారు. నరసరావుపేటలోని లైఫ్‌లైన్ హాస్పటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపి వైద్యులకు ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు చేరువచేశారని కొనియాడారు. తమ వైద్యశాలలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పురాతన కాలంగా పల్లెల్లోను, మారుమూల ప్రాంతాల్లోను నివాసముంటున్న ప్రజలకు ప్రాథమికవైద్యం అందించి వైద్యసేవలు చేస్తున్న గ్రామీణ వైద్యుల సేవలు మరువలేనివని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు పారామెడికల్ శిక్షణనిచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ ఆర్‌ఎంపీ వైద్యులు షేక్.చింతపల్లి ఫకీర్‌అహ్మద్, రత్నం, రమణారెడ్డి, హుస్సేన్, ఆచారి, బ్రహ్మంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎంపీఏ డివిజన్ అధ్యక్షుడు షేక్.బాజి, డాక్టర్ పి.రాజ్యలక్ష్మి, డాక్టర్ ప్రసన్న లక్ష్మి, ఆర్‌ఎంపీ యూనియన్ నాయకులు చెన్నారెడ్డి, సైదా, నారాయణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం

నాదెండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తూబాడు పంట పొలాల్లో చోటు చేసుకుంది. ఎస్ఐ జె. బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తూబాడు గ్రామానికి చెందిన రావూరి డేవిడ్ (45) నాలుగేళ్లుగా ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, పోతుకట్లలో నివాసం ఉంటున్నాడు. ఏడాది కిందట వీధి కుక్క కరిచింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా స్వస్థత చేకూరకపోడంతో మనస్తాపానికి గురయ్యాడు. మూడు రోజుల కిందట ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పొలాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహం జేబులోని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రావూరి సువార్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించటంతో పోతుకట్లకు తరలించారు.

సంఘం అభివృద్ధికి కృషి

దాచేపల్లి : సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని సంఘ పెద్దగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ సంఘం పెద్దగా ఆదివారం రత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ పెద్దగా ఎన్నికైన రత్నంను శాలువా, పూలదండలతో సన్మానించారు. చర్చి అభివృద్ధితో పాటుగా సంఘంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, తనపై సంఘం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని రత్నం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ తగరం ప్రేమయ్య, సంఘస్థులు నాగెండ్ల యాకోబు, పత్రా ఆనందరావు, మాతంగి సత్యనందం, మాతంగి రాంబాబు, పత్రా రమేష్, నాగెండ్ల మహేష్, నాగెండ్ల ఏసయ్య, స్త్రీల సమాజం వారు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మాచవరం: గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మాచవరంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన వంగర పూర్ణచంద్రరావు (48) ఏడాది నుంచి జీవనోపాధి నిమిత్తం గుంటూరులో నివాసం ఉంటున్నాడు. అక్కడా సరిగా పనులు లేక కుటుంబ పోషణ బారంగా మారింది. ఆర్థిక పరిస్థితులు వల్ల గత నెల 28న స్వగ్రామానికి భార్యా పిల్లలతో కలిసి తిరిగి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక అదేరోజు ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు.

వేద పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలో గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులకు స్థానిక అగ్నిమాపక శిక్షణ కేంద్ర ఉద్యోగి కూచిపూడి శ్రీనివాసరావు దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. ఆదివారం ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా హాజరై విద్యార్థులకు వస్త్రాలను అందజేశారు. వారికి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద విద్యార్థులు ఆశీర్వచన నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. విద్యార్థులకు నూతన వస్త్రాలు అందించిన శ్రీనివాసరావు దంపతులకు వేద పాఠశాల గురువులు రత్నమాచార్యులు అభినందనలు తెలిపారు.

సొసైటీ ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు ప్రారంభం

శావల్యాపురం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సారథ్యంలో వచ్చే నెలాఖరులోగా శావల్యాపురం ప్రధాన సెంటరు మార్గంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించనున్నట్లు సీఈవో జాలాది నాగప్రసాద్ ఆదివారం తెలిపారు. కేంద్ర సహకార బ్యాంకు సౌజన్యంతో అన్ని రకాల ఔషధాలు తక్కువ ధరకు సరఫరా అవుతాయన్నారు. ఇందుకుగాను ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో ఐదు ఔషధ దుకాణాల్ని ఎంపిక చేయగా, అందులో శావల్యాపురం సొసైటీ తరపున ఒకటి మంజూరు అయినట్లు చెప్పారు. దుకాణంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం క్యాలిఫైడ్ వ్యక్తి ద్వారా అమ్మకాలు జరుగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): స్నేహ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్యం, కర్నాటక సంగీతం, జానపద నృత్యం, కర్రసాములో 400మంది విద్యార్థినులు ఇటీవల అత్యుత్తమ ప్రతిభ కనబరచి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో సుస్థిర స్థానం సంపాదించినట్లు ఆ అకాడమీ డైరెక్టర్ ప్రతిమ తెలిపారు. స్థానిక మెయిన్ బజారులోని సన్నిధి వెంకట ఆంజనేయులు ధ్యాన మందిరంలో వినుకొండకు చెందిన 48మంది విద్యార్థినులకు ఆదివారం వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అకాడమీ డైరెక్టర్ ప్రతిమను దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే షకీలా, ఎంస్‌కే బాషా, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి పూజలు

నాదెండ్ల: మండలంలోని గణపవరంలో సింగు వారి ఇలవేల్పు అంకమ్మ తల్లి వార్షిక కొలుపులు పురస్కరించుకుని ఆదివారం నెల పొంగళ్లు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. గత నెల 28,29,30 తేదీల్లో అమ్మవారి వార్షిక కొలుపులు జరిపిన సంగతి తెలిసిందే. నెల పొంగళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి సింగు వారి కుటుంబ సభ్యులు హాజరై అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.